క్లుప్తంగా

విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



వాలీబాల్ క్రీడాకారులకు క్రీడలో మెళకువలు నేర్పుతున్న వీరారెడ్డి

కోదాడ : విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆసక్తి ఉన్న క్రీడలో మెళకువలు నేర్చుకోవాలని సిద్దిపేట వాలీబాల్ అకాడమీ కోచ్ బేత వీరారెడ్డి సూచించారు. శుక్రవారం కోదాడ బాలుర పాఠశాలకు వచ్చిన ఆయన ఇక్కడ వాలీబాల్ క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు క్రీడలో మెళకువలు నేర్పి మాట్లాడారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ జూలూరి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



జెండాలు ఊరేగిస్తున్న గౌడ కులస్తులు

చిలుకూరు : పాత చిలుకూరులో గీత పారిశ్రామిక సంఘం, గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర సురమాంబదేవి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలో జెండాలను ఊరేగించారు. శనివారం స్వామి అమ్మవారి విగ్రహాల ఊరేగింపు, ఆదివారం ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన, స్వామివారి కల్యాణం, అన్నదానం, సోమవారం పాత కాటమయ్య గుడి దగ్గర బలి చల్లుట, జాతర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గౌడ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గేదెలు రోడ్లపైకి వస్తే యజమానులపై చర్యలు

చిలుకూరు : గేదెలను మేతకు బయటకు వదలొద్దని, అవి రోడ్లపైకి వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, గేదెలు రోడ్లపైకి వస్తే వాటి యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సురభి రాంబాబు గౌడ్ తెలిపారు. శుక్రవారం చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గేదెలు రాత్రి సమయంలో కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపైకి వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గేదెలు రోడ్డుపైకి రాకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దగ్గరుండి గేదెలను మేపుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గరిడేపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నరేష్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మంగాపురంలో సీజనల్ వ్యాధులపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. దోమలతో డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ డ్రై డే పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, ఎల్టీ ఉపేందర్, ఏఎస్‌ఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్‌లో బీసీలకు తీవ్ర నష్టం



నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

హుజూర్‌నగర్ : 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వటం వల్ల బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని జాతీయ బీసీ సంక్షేమ నియోజకవర్గ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం 3 వార్డు అధ్యక్షుడిగా వి. శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ శుక్రవారం పట్టణంలోని బీసీ భవన్‌లో ఆయన నియామకపత్రం అందజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను ఎత్తివేయాలని కోరారు. 10 శాతం ఉన్న ఓసీలలో ఆర్థికంగా వెనుకబడిన వారు ఐదు శాతం మాత్రమే ఉంటారని అన్నారు. ఐదు శాతం ఉన్నవారికి 10 శాతం రిజర్వేషన్లు, 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వటం సరికాదన్నారు. బీసీలకు జరుగుతున్న నష్టాన్ని వివరిస్తూ వారిని చైతన్య పరచాల్సిన బాధ్యత బీసీ నాయలపై ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.గోవిందరావు, అంజియాదవ్, ఆర్.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వరరావు, కె.అశోక్, బ్రహ్మాచారి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, అఖిల్, కృష్ణ, శివ, అనీఫ్, లక్ష్మణ్, శేఖర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బంగారు మైసమ్మ జాతర

నడిగూడెం : మండలంలోని రామాపురంలో బంగారు మైసమ్మ ఆలయం వద్ద శనివారం నుంచి రెండు రోజుల పాటు జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నేలమర్రి శ్యామ్, సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



కోదాడ : బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నేరేడుచర్లలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు.

కోదాడరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ ఎం డి.సలీంషరీఫ్ అన్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని శుక్రవారం మండల వ్యాప్తంగా బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఆయన పలు చోట్ల పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, టీచర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

కోదాడ : ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు, అర్హత ఉన్న ఉపాధ్యాయులున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోదాడ బాలుర పాఠశాల పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ సలీం షరీఫ్ కోరారు. శుక్రవారం కోదాడలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డి.మార్కెండేయ, శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ, కనకమ్మ, పాండురంగాచారి, ఖాజామియా, జానకిరామ్, చిన్నప్ప, రవి, అశోక్ గౌడ్, బడుగుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రచారం..

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కర్కాయలగూడెం, బూరుగడ్డ, మాచవరం గ్రామాల్లో బడిబాటలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో శుక్రవారం జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గ వీధిలోని ఎంపీపీఎస్ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందే సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస కుమార్, గోవర్ధన కుమారి, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, అన్ని సౌకర్యాలు ఉన్నాయని చిలుకూరు కాంప్లెక్స్ చైర్మన్, చిలుకూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిలుకూరు మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో బడిబాట ర్యాలీ

నేరేడుచర్ల : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పు కళాకారుల బృందం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సురిగి సైదులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కణతం చిన వెంకటరెడ్డి, ధనుంజయనాయుడు, కొదమగుండ్ల నగేష్, వాసా కరుణాకర్, చిలకరాజు శ్రీను, ఉపాధ్యాయులు, సమభావన సంఘాల మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులున్నారు.

పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అలాగే మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. నడిగూడెం పంచాయతీ కార్యదర్శి ఎలకా ఉమారాణి, తెల్లబెల్లి గ్రామ మాజీ సర్పంచ్ దేవబత్తిని వెంకటనర్సయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మఠంపల్లి : లాలితండాలో..

ఇంగ్లిష్ మీడియంలో బోధన

మఠంపల్లి : గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు నూతనంగా ఇంగ్లిష్‌లో మీడియంలో విద్యా బోధన ఉంటుందని, పిల్లల్ని ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండలంలోని లాలితండా, గుర్రంబోడు తండా, కృష్ణతండా, తుమ్మల తండా తదితర గ్రామాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ ప్రచారం చేసి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. 3 నుంచి 9వ తరగతి వరకు ప్రతి తరగతిలో 40 సీట్లు ఉన్నాయని ఎస్టీలకు 70 శాతం, ఎస్సీలకు 10 శాతం, బీసీలకు 10 శాతం, ఓసీలకు 10 శాతం చొప్పున విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. ఉచిత భోజనం, వసతి, మెరుగైన విద్యా బోధన, ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు ఉన్నారు.



హుజూర్‌నగర్ : బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డలో..



చిలుకూరులో..

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో టాపర్లుగా చిలుకూరు విద్యార్థులు



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

చిలుకూరు : ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) ఫలితాల్లో చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు జిల్లా టాపర్స్‌గా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో పాఠశాల విద్యార్థి బి.రవి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, పి. చైత్ర ద్వితీయ స్థానం, వై.హరిణి జిల్లా 7వ స్థానం, ఈశ్వర్ 17వ ర్యాంకులతో పాటు కె.సన ఎస్సీ కేటగిరిలో జిల్లా 4వ స్థానం, భవ్యశ్రీ ఎస్సీ కేటగిరిలో జిల్లా 7వ స్థానం, జి.అఖిల్ ఎస్టీ కేటగిరిలో జిల్లా 7వ స్థానం, కౌశిక్ బీసీ(ఏ) కేటగిరిలో జిల్లా 3వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పాఠశాల నుంచి మొత్తం 8 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, ఉత్తమ కోచింగ్ అందించిన భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు కందిబండ రామారావును గ్రామస్తులు అభినందించారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం



సైదిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న ఉస్తెల సైదిరెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సైదిరెడ్డి దంపతులను తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు సమాజసేవ చేయాలని పిల్లలకు నేర్పిన వ్యక్తి సైదిరెడ్డి అని కొనియాడారు. శేష జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, నరసింహారెడ్డి, పొనగండ్ల భాస్కరరెడ్డి, ఎంఈఓ వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు నిదర్శనం బీజేపీ పాలన

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : పారదర్శకత, ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనంగా బీజేపీ పాలన ఉందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండలం దొండపాడులో నిర్వహించిన పార్టీ మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశానికి సేవ చేయడమే లక్ష్యమని అన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పదకొండు ఏళ్లలో ప్రజల విశ్వాసాన్ని చూరగొని పాలన అందించిందని అన్నారు. ప్రతి కార్యకర్త కూడా ఈ విజయయాత్రలో భాగస్వామిగా ఉండాలని అన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. అనంతరం పార్టీ మండల కమిటీని ప్రకటించారు. మండల ఉపాధ్యక్షుడిగా బి.నాగరాజు, పి.నరసింహారావు, ఎస్.లావణ్య, బి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా కె.రమేష్, ఎం.వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా పి.లలిత, ఆంజనేయశాస్త్రి, వి.రామారావు, జె.రాణి, కోశాధికారిగా బి.రమేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పి.విజయ్, హనుమంతరావు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి

శునకానికి శస్త్రచికిత్స

- మూత్రాశయంలో రాళ్ల తొలగింపు



కుక్కకు శస్త్ర చికిత్స చేస్తున్న పశువైద్యులు

హుజూర్‌నగర్ : శునకానికి పశువైద్యులు శస్త్ర చికిత్స చేసి మూత్రాశయంలో రాళ్లను తొలగించారు. పశువైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామానికి చెందిన పల్లె భాస్కర్ రెడ్డి ల్యాబ్ జాతి కుక్కను పెంచుకుంటున్నాడు. అది మూత్ర విసర్జన సమయంలో ఇబ్బంది పడుతుండటంతో దానిని శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకువచ్చారు. పశువైద్యులు అన్ని పరీక్షలు చేసి కుక్క మూత్రాశయంలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు, సీనియర్ సర్జన్ డాక్టర్ రూప్‌కుమార్, అసిస్టెంట్ సర్జన్ కొణతం శ్రీనివాసరెడ్డిలు కలిసి సుమారు నాలుగు గంటలపాటు శ్రమించి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. దాదాపు 12 ఎంఎం నుంచి 20 ఎంఎం పరిమాణం గల దాదాపు 100 రాళ్లను మూత్రాశయం నుంచి తొలగించారు. ప్రస్తుతం కుక్క ఆరోగ్యం నిలకడగా ఉన్నదని వారు తెలిపారు. శస్త్రచికిత్సలో వెటర్నరీ డాక్టర్లు వీరారెడ్డి, శైలజ, సత్యావతి, సిబ్బంది రాజేందర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



కోదాడరూరల్ : మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



నేరేడుచర్ల : 15వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోదాడరూరల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని, తద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ 10వ వార్డులో వంద రోజుల కార్యాచరణ అమలులో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు డాక్టర్.. వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీముఖి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, భవాని, జానిమియా, సాయికృష్ణ, రాజయ్య, నీరజ తదితరులు ఉన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 15వ వార్డులో తడి, పొడి చెత్త, ఎరువుల తయారీ విధానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ వార్డులో మురుగు కాలువల్లో పూడిక తీయాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. వార్డులో నిరుపేదలను గుర్తించాలని సమభావన సంఘాల మహిళలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వార్డు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



చిలుకూరు : మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



నేరేడుచర్ల : పెంచికల్‌దిన్నలో మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీన జరగబోయే సీపీఐ జిల్లా మహాసభలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పలువురు పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం చిలుకూరులోని సీపీఐ భవన్‌లో మహాసభ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా మహాసభలకు గ్రామాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ, జిల్లా నాయకులు రెమిడాల రాజు, చేపూరి కొండలు, దొడ్డా నాగేశ్వరరావు, కస్తూరి సత్యం, కట్టేకోల నాగేశ్వరరావు, సాతులూరి అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రం విడుదల

నేరేడుచర్ల : సూర్యాపేటలోని రితిక ఇన్ బ్యాంకెట్ హాల్‌లో ఈనెల 8వ తేదీన జరగనున్న సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాన్ని శుక్రవారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, కత్తి కుమార్ రెడ్డి, శివ, కోటిరెడ్డి, వెంకన్న తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని అమరవరంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న హుజూర్‌నగర్ తహసీల్దార్ మండడి నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై అనేకమంది రైతులు దరఖాస్తులు ఇవ్వలేకపోయారని, వారికి దరఖాస్తులు ఇచ్చే అవకాశం కల్పించాలని కోరారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు బాలసైదులు, వీరస్వామి, నాగమణి, రాములు, సైదులు, రైతులు పాల్గొన్నారు.

బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఈద్గాలో శనివారం నిర్వహించబోయే బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల ఏర్పాట్లను ముస్లిం మైనార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎండీ గౌసొద్దీన్, ఎస్‌కే మన్సూర్ అలీ, ఎస్‌కే బిక్కన్, మజీద్, ఎండీ అజీజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నాయకుల సంతాపం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ శానిటేషన్ వర్కర్, సెక్యూరిటీ గార్డు బి.నాగయ్య మృతి పట్ల శుక్రవారం స్థానిక నాయకులు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, పద్మ, శ్రీను, సుందరమ్మ, బేగం, ఉష, భద్రమ్మ, రాములమ్మ, జ్యోతి, గోదావరి, వీణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కోదాడరూరల్ : ఎర్రవరంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ వాజిత్ అలీ



నడిగూడెం : సిరిపురంలో దరఖాస్తు తీసుకుంటున్న తహసీల్దార్ సరిత

మోతె : భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.వెంకన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరికొండ, విభళాపురం గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు రైతు సదస్సు

నడిగూడెం : వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఖరీఫ్ సీజన్ సాగుకు సంబంధించి రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జాతీయ వరి పరిశోధన స్థానం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్.శ్రీదేవి, గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త నరేష్ హాజరు కానున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూసమస్యలపై దరఖాస్తు చేసుకోవాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు కాలనీ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి తహసీల్దార్ దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. రైతులు భూముల సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు వాసుదేవరావు, ఆత్రేయ, రెవెన్యూ సిబ్బంది, రైతులు నాయకులు పాల్గొన్నారు.



మోతె : తహసీల్దార్‌కు దరఖాస్తు పత్రం అందజేస్తున్న రైతు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

కోదాడరూరల్ : భూ భారతి రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని తహసీల్దార్ వాజిద్‌అలీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరేపల్లి వెంకటసుబ్బారావు, భాషబోయిన భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సిరిపురంలో 201 దరఖాస్తులు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురంలో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిపురం రెవెన్యూ పరిధిలోని రైతులు 201 దరఖాస్తులను అధికారులకు అందజేశారు. అనంతరం తహసీల్దార్ వి.సరిత మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీధికుక్కల స్వైరవిహారం

- గ్రామాల్లో ప్రజలపై కుక్కల దాడి
- ఈఏడాది 45కు పైగా కుక్క కాటు కేసులు నమోదు
- శునకాలను నియంత్రించాలని జనం వేడుకోలు



చిలుకూరులో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

చిలుకూరు : ఒకప్పుడు పట్టణాల్లో కొందరి ఇళ్ల గేట్లకు కుక్కలున్నాయి జాగ్రత్త అనే బోర్డులు ఎక్కువగా దర్శనమిస్తుండేవి. దీంతో ఆయా ఇళ్లలోకి వెళ్లాలంటే యజమానులను పిలిచి వాళ్లు వచ్చాకే ఎవరైన జాగ్రత్తగా వెళ్లేవారు. కానీ ఇప్పుడు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ వీధి చూసినా గుంపులుగా కనపడుతున్నాయి. గ్రామాల్లో పాలకులు లేక గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో వాటి బెడదను నివారించే నాథుడే కరువయ్యారు. మండల స్థాయి ముఖ్య అధికారులే గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా ఉన్నా ప్రయోజనం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు పిచ్చికుక్క కాటుకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఒంటరిగా రోడ్లపై నడుచుకుంటూ వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

వారానికి రెండు, మూడు కేసులు..

చిలుకూరు మండల కేంద్రంతో పాటు బేతవోలు, నారాయణపురం, కొండాపురం, చెన్నారిగూడెం, అచార్యులగూడెం, పోలేనిగూడెం తదితర గ్రామాల్లో వీధి కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గత ఏడాది 120 మంది కుక్క కాటుకు గురయ్యారు. ఈ ఏడాది ఇప్పటికే 45 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే కేసులు కాకుండా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారు కూడా వందల సంఖ్యలో ఉన్నారు. దీన్ని బట్టి గ్రామాల్లో కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వారానికి కనీసం రెండు నుంచి మూడు కేసులు వస్తున్నాయి.

కుక్కల బెడదను నివారిస్తాం



గ్రామాల్లో కుక్కల బెడద ఉన్నమాట వాస్తవమే. ఈ విషయం మా దృష్టికి కూడా వచ్చింది. కుక్కలను పట్టి తరలించేలా చర్యలు తీసుకుంటాం. కుక్కలకు ఇప్పటికే ఇంజక్షన్లు కూడా చేయించాం. ఉన్నత అధికారులతో మాట్లాడి పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కారిస్తాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

– కె.గిరిబాబు, ఎంపీడీఓ

మూగజీవాలపై దాడి..

గ్రామాల్లో కుక్క కాటుకు మూగజీవాలు కూడా బలవుతున్నాయి. సీతారాంపురం గ్రామంలో పది రోజుల క్రితం అంగన్‌వాడీ టీచర్‌పై కుక్క దాడి చేసి గాయపరిచింది. పలు గ్రామాల్లో బర్రె దూడలు, గొర్రెలు, మేకలపై కుక్కలు దాడి చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. కుక్క కరిచిన వెంటనే నీటితో కరిచిన చోట శుభ్రం చేసి వెంటనే వైద్యశాలకు రావాలని, ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని వైద్యాధికారులు, సిబ్బంది చెబుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి గ్రామాల్లో కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.